కొలిమి మండితేనే కలిమి

- నిప్పుల మాటున వేగిపోతున్న కమ్మర్ల జీవితాలు
- పెరిగిన ముడి సరకుల ధరలు
- నైపుణ్యం, నాణ్యత ఉన్నా వ్యాపారం అంతంత మాత్రమే
- యాంత్రీకరణతో చిన్నాభిన్నం అవుతున్న కుల వృత్తులు


ఇనుప ముక్కను కొలిమిలో కాలుస్తున్న కమ్మర్లు


విక్రయానికి సిద్ధంగా ఉన్న వ్యవసాయ పనిముట్లు, గృహోపకరణాలు

సామర్లకోట: వ్యవసాయ పనిముట్లకు అవసరమైన పరికరాల తయారీలో పట్టణంలోని కమ్మర్లకు మంచి పేరుంది. ఇక్కడ తయారైన పరికరాలు నాణ్యమైనవి కావడంతో డిమాండ్ కూడా అదే స్థాయిలో ఉంటుంది. జిల్లాలోని అనేక ప్రాంతాల వారు ఇక్కడకు వచ్చి వ్యవసాయ పరికరాలతో పాటు, గృహోపకరణాలు కొనుగోలు చేసి తీసుకువెళ్తుంటారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో వ్యవసాయ పనిముట్లకు ప్రస్తుతం గిరాకీ ఏర్పడింది. తాము తయారు చేసే వస్తువులకు డిమాండ్ ఉన్నప్పటికీ ఆశించిన స్థాయిలో లాభాలు రావడం లేదని తయారీదారులు వాపోతున్నారు. ముడి సరుకు ధరలు పెరగడంతో పాటు, తయారీదారులు ఏటేటా తగ్గిపోవడం.. అవసరమైన సహాయకులు లేకపోవడంతో పనిభారం పెరుగుతోందని వారు అంటున్నారు. బొగ్గుల కొలిమిని తయారు చేయడానికి ఒకరు, ఇనుప ముక్కలను బొగ్గులలో ఉంచడానికి మరొకరు, ఎర్రగా కాలిన ఆ ఇనుప ముక్కలను సుత్తి, సమ్మెటలతో కొట్టడానికి మరొకరు పని చేస్తూ ఉంటారు.

నియోజకవర్గ పరిధిలోని సామర్లకోటలో 15 వరకు కమ్మరశాలలు ఉన్నాయి. వీటిలో నిపుణులైన పనివారు 20 మంది వరకు ఉంటారు. మొత్తంగా వారికి సహాయకులుగా 40 మంది వరకు పనిచేస్తుంటారు. ఏడాదికి రూ.రెండు లక్షలు పెట్టుబడి పెట్టి వ్యవసాయ పనిముట్లు, ఇంటి అవసరాలకు అవసరమైన పరికరాలను తయారు చేసి విక్రయిస్తే రూ.3 లక్షల వ్యాపారం జరుగుతుంది.

వ్యవసాయ పనిముట్లకు అవసరమైన కత్తులు, గొడ్డళ్లు, కొడవళ్లు, తవ్వుగొల్లతోపాటు వంట సామగ్రికి ఉపయోగించే అట్ల రేకులు, పెనం, అట్లకాడ వంటి పరికరాలను తయారు చేస్తారు. అయితే ప్రస్తుతం యంత్రాలతో తయారు చేసిన వస్తువులు రావడంతో వీరికి డిమాండ్ తగ్గిపోయింది. కాకినాడ, భీమవరం, రాజమహేంద్రవరం నుంచి 100 కిలోల ముడి ఇనుము రేకు రూ.90 వేల వరకు ఖర్చు చేసి కొనుగోలు చేస్తుకొంటున్నారు.

పెరిగిన ముడి సరకు ధరలు



కమ్మరిశాలలో తయారు చేసే వస్తువులకు అవసరమైన ఇనుము, బొగ్గు ధరలు పెరిగి పోయాయి. కిలో ఇనుము రూ.90, 10 కేజీల బొగ్గు రూ.500కు కొనుగోలు చేయాల్సి వస్తోంది. మరో పని చేయడం రాక, అవకాశం లేక కుల వృత్తిగా నమ్ముకుని కష్టం అయినా మండే ఎండలో నిప్పుల కొలిమి వద్ద మా జీవితాలను వెళ్లదీస్తున్నాం. ఉపాధి పనులకు ఉపయోగించే వస్తువులు తమకు ఆర్డరు ఇస్తే కొంత వరకు మాకు ఉపాధి లభిస్తుంది.

– సారంపాటి లోవాచారి,
కమ్మరి వ్యాపారి, సామర్లకోట

యంత్రాలతో తట్టుకోలేని పోటీ..

వివిధ రకాల యంత్రాలతో వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరలకు తయారు చేసి మార్కెట్‌లో విక్రయించడం వల్ల కమ్మర్లు తయారు చేసే వస్తువులు నాణ్యతగా ఉన్నప్పటికీ కొనుగోలు చేసేవారు తగ్గిపోయారు. అలాగే గతంలో ఇనుముతో తయారు చేసిన పెనం, అట్లకాడ స్థానే స్టీలుతో తయారైన అట్లకాడలు, మూకుళ్లు వినియోగించడంతో తాము తయారు చేసిన వస్తువులు కొనుగోలు చేసేవారు కరువయ్యారని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత 50 ఏళ్లుగా ఒకే రకమైన జీవితాలను గడుపుతున్నామని వారు ఆవేదన చెందుతున్నారు. తమకు సంఘం లేక పోవడం వల్ల ఐక్యత లేకుండాపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ క్యాడర్ ఆందోళన చెందవద్దు

- ప్రతి కార్యకర్తకు అండగా ఉంటాం
- మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి


సమావేశంలో మాట్లాడుతున్న నెక్కంటి సాయి ప్రసాద్

పెద్దాపురం: సార్వత్రిక ఎన్నికల్లో ఓటమితో వైఎస్సార్ సీపీ క్యాడర్‌కు ఆందోళన అవసరం లేదని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. స్థానిక గోలివారి వీధిలోని ఆయన స్వగృహంలో శుక్రవారం పట్టణ కౌన్సిలర్లు, కార్యకర్తలతో సమావేశమై ప్రజా తీర్పును సానుకూలంగా తీసుకుందామన్నారు. పార్టీ కార్యకర్తలపై జరుగుతున్న దాడులను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. కూటమి అధికారం చేపట్టగానే పట్టణ కౌన్సిలర్‌పై దాడితో పాటు, దర్గాసెంటర్‌లోని పెట్రోల్ బంక్‌పై దాడి చేశారన్నారు. 2019లో అధికారం చేపట్టిన నాటి నుంచి నేటి వరకు వైఎస్సార్ సీపీ ఎటువంటి దాడులకు పాల్పడలేదన్నారు. సమావేశంలో కౌన్సిలర్లు త్సలికి సత్యభాస్కర్, విజ్జపు రాజశేఖర్, విడదాసరి రాజా, ఆరెళ్లి వీర్రాఘవులు, పెంటకోట సత్తిబాబు, తాడి రాజశేఖర్, వాసంశెట్టి గంగ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా శృంగార వల్లభుని ఆలయ ధ్వజస్తంభ ప్రతిష్ఠ


పూజల్లో భాగంగా ధ్వజస్తంభానికి హారతి ఇస్తున్న అర్చకుడు

పెద్దాపురం: శృంగార వల్లభ స్వామి ఆలయంలో నూతన ధ్వజస్తంభ ప్రతిష్ఠ ప్రథమ వార్షికోత్సవ మహోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. చదలాడ గ్రామానికి చెందిన ఉండవల్లి వారి కుటుంబ సభ్యులు, భక్తుల సహకారంతో ఏర్పాటు చేసిన ధ్వజస్తంభం వద్ద ఆలయ ఈఓ వడ్డి శ్రీనివాస్ ఆధ్వర్యంలో వేద పండితులు మంత్రాల నడుమ ప్రత్యేక పూజలు చేశారు. ఈ మహోత్సవానికి ఆయా గ్రామాల నుంచి భక్తులు వందలాదిగా తరలివచ్చారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మొయిళ్ల కృష్ణమూర్తి, ఆలయ చైర్మన్ కర్రి జగదీష్, చదలాడ గ్రామ నాయకులు ఉండవల్లి రాంబాబు, శెట్టి వెంకన్న, ఉండవల్లి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవం

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ వ్యవస్థాపక దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. లయన్స్ క్లబ్‌ను స్థాపించిన మెల్విన్ జోన్స్ చిత్రపటానికి అడబాల రత్నప్రసాద్, విశ్రాంత ఉపాధ్యాయుడు లయన్ నిమ్మకాయల వెంకటేశ్వరరావు, రెడ్నం రాజా, సత్యనారాయణ తదితరులు నివాళులర్పించారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరాలు


విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందించిన గ్రంథాలయాధికారులు

కొత్తపల్లి: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని, ప్రతిఒక్కరూ గ్రంథాలయాల ద్వారా విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని వైఎస్సార్ సీపీ సచివాలయాల కన్వీనర్ ఉమ్మిడి జాన్ అన్నారు. మండలంలోని ఉప్పాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ శిబిరాల్లో శిక్షణ పొందిన విద్యార్థులకు గ్రంథాలయ అధికారులు టి.నళినీ ప్రియ, జయకృష్ణ ఆధ్వర్యంలో మెమెంటో, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మిడి జాన్ మాట్లాడుతూ విద్యార్థులు పుస్తక పఠనాన్ని అలవర్చుకోవాలన్నారు. ప్రతిరోజూ గ్రంథాలయాలను సందర్శించి పుస్తకాలను చదవడం ద్వారా విజ్ఞానం పెంపొందుతుందన్నారు. 20 రోజుల పాటు శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను ఆయన అభినందించారు. వేసవి విజ్ఞాన శిబిరాల్లో భాగంగా విద్యార్థులకు పుస్తక పఠనం, చిత్ర లేఖనం, గణితం, స్పోకెన్ ఇంగ్లిష్, కథలు చెప్పడం తదితర అంశాలపై శిక్షణ ఇచ్చినట్టు గ్రంథాలయాధికారులు తెలిపారు.


విజేతలకు బహుమతులు అందజేస్తున్న ప్రముఖులు

పుస్తక పఠనంతో విషయ పరిజ్ఞానం

పెద్దాపురం: గ్రంథాలయంలో పుస్తక పఠనం ద్వారా విద్యార్థులు మంచి విషయ పరిజ్ఞానం సాధించవచ్చని ఉపాధ్యాయులు రాళ్లపల్లి వెంకటేశ్వరరావు, తాడిగడప సుబ్బారావు అన్నారు. స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ తరగతుల ముగింపు సభ శుక్రవారం గ్రంథాలయాధికారి పాలంకి నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత 45 రోజులుగా గ్రంథాలయ శాఖ ద్వారా విద్యార్థులకు పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చినట్టు తెలిపారు. తద్వారా నేర్చుకున్న ప్రతి అంశాన్ని విద్యార్థులు గుర్తుంచుకుని మంచి పరిజ్ఞానం సాధించాలన్నారు. సాహితీ స్రవంతి గౌరవాధ్యక్షుడు చల్లా విశ్వనాథం మాట్లాడుతూ విద్యార్థులకు పాఠశాలల్లో చెప్పే విద్యా బోధన కంటే భిన్నంగా మంచి చెడు, విచక్షణ, నైతిక విలువలు పెంపొందించుకోవడం వంటి అంశాలు ఈ శిక్షణ ద్వారానే సాధ్యమన్నారు. అనంతరం వివిధ అంశాల్లో విద్యార్థులకు నిర్వహించిన పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సింగం బుల్లియ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

విజేతలు వీరే..

వ్యాసరచన పోటీల్లో జి.మృదుల (ప్రథమ), రాయవరపు అయ్యప్ప (ద్వితీయ), సీహెచ్ శివరామ్ (తృతీయ), చిత్రలేఖన పోటీల్లో తాడిగడప రసజ్ఞ వాగ్దేవి (ప్రథమ), రాయవరపు సత్యసాయి (ద్వితీయ), దాసరి చరణి (తృతీయ), క్విజ్ పోటీల్లో సీహెచ్ సాయి గణనాథ్ (ప్రథమ), షేక్ ఖాదర్ నవాజ్ (ద్వితీయ), దాసరి వెంకట దుర్గ ముఖేష్ (తృతీయ) బహుమతులు సాధించారు.

టీటీ అంపైర్లకు శ్రీప్రకాష్‌లో శిక్షణ

రాష్ట్ర టీటీ అకాడమీ అభివృద్ధి మండలి చైర్మన్ విజయ్‌ప్రకాష్


అంపైర్ల శిక్షణ సమావేశంలో మాట్లాడుతున్న విజయ్ ప్రకాష్


పెద్దాపురం: టేబుల్ టెన్నిస్ అంపైర్లకు తొలిసారి పెద్దాపురం శ్రీ ప్రకాష్ పాఠశాలలోనే శిక్షణ ఇవ్వనున్నట్టు పాఠశాల డైరెక్టర్, ఏపీ టీటీ అకాడమీ డెవలప్‌మెంట్ కమిటీ చైర్మన్ సీహెచ్ విజయ్‌ప్రకాష్ అన్నారు. స్థానిక శ్రీ ప్రకాష్ సినర్జీ పాఠశాలలో శుక్రవారం అంపైర్ల శిక్షణను ఆయన ప్రారంభించారు. అనంతరం అంపైర్లకు ఈ నెల 8వ తేదీ నుంచి నిర్వహించే టీటీ పోటీల నిబంధనలపై పరీక్ష నిర్వహించారు. డీఎస్ఆర్ కుమార్, డీవీఎస్‌వై శర్మ, ఏవీఎస్ శింగరాజు, ఏపీ టీటీ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ వేణుగోపాల్, ఆయా జిల్లాల నుంచి 25 మంది అంపైర్లు పాల్గొన్నారు.

ధూమపానంతో ప్రాణాంతక వ్యాధులు

తుని: ధూమపానంతో గుండె, ఊపిరితిత్తుల సంబంధిత వ్యాధులు వ్యాప్తి చెందుతాయని పలువురు వైద్యులు హెచ్చరించారు. స్థానిక ఏరియా ఆసుపత్రిలో ప్రపంచ పొగాకు నివారణ దినోత్సవాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యులు మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ధూమపానానికి దూరంగా ఉండాలన్నారు. జనసంచారం ఉన్న ప్రాంతాల్లో ధూమపానం చేయకూడదన్నారు. చుట్ట, బీడీ, సిగరెట్ తాగడం వల్ల నోటి క్యాన్సర్, ఊపిరితిత్తుల క్యాన్సర్, మెదడు సంబంధిత వ్యాధులు వస్తాయన్నారు. ఆరోగ్యంగా ఉండాలంటే ధూమపానానికి దూరంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో నర్సింగ్ సూపరింటెండెంట్ మాలతీరాణి, వైద్యులు వినోద్‌కుమార్, తేజేశ్వరి, సౌజన్యరత్నం, ఎన్‌సీసీ పి.రాఘవులు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యాన తోటల పెంపకానికి దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు రూరల్: ఉద్యాన తోటల పెంపకానికి ఆసక్తి కలిగిన రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ డేవిడ్ రాజు సూచించారు. శుక్రవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఐదెకరాల లోపు భూమి, ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన వారు ఇందుకు అర్హులని చెప్పారు. వన్- బి, జాబ్ కార్డు, ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం, జెరాక్స్‌లతో ఈ నెల 10వ తేదీలోగా ఉపాధి ఏపీఓ, ఫీల్డ్ అసిస్టెంట్లను సంప్రదించాలని సూచించారు. రైతులకు మొక్కలను ప్రభుత్వం ఉచితంగా ఇవ్వడంతో పాటు తోటలకు నిర్వహణ ఖర్చులు అందజేస్తుందని వివరించారు.



పంట కాలువల ఆక్రమణ


చెరువు నుంచి వచ్చే కాలువను పూడ్చివేసిన దృశ్యం

కొత్తపల్లి: మండల పరిధిలోని గ్రామాల్లో పలువురు పంట కాలువలను ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. పట్టించుకోవాల్సిన అధికారులు మామూళ్ల మత్తులో పడి తమకేమీ పట్టనట్టుగా వ్యవహరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. మండలంలోని వాకతిప్ప సత్తెమ్మతల్లి ఆలయం వద్ద పంట పొలాలను లే అవుట్‌గా మార్చేశారు. ఈ లే అవుట్‌కు అన్ని అనుమతులు పొందినట్లు నిర్వాహకులు చెబుతున్నారు. కాగా రెండు ప్రధాన కాలువలను పూర్తిగా ఆక్రమించి లే అవుట్‌ను ఏర్పాటు చేశారు. కాలువలను ఆక్రమించడంతో ఎగువ ప్రాంతం నుంచి వచ్చే నీరుపోయే మార్గం లేక పంటపొలాలు ముంపునకు గురయ్యే ప్రమాదం ఉందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. లే అవుట్ యజమానులు పంట కాలువలను ఆక్రమించినా అధికారులు పట్టించుకోకపోవడంతో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులకు మామూళ్లు ముట్టడంతోనే చూసీచూడనట్టు వ్యవహిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. దీనిపై గ్రామ రెవెన్యూ అధికారి చంద్రశేఖర్‌ను వివరణ కోరగా సర్వే చేసి పంట కాలువ ఆక్రమణకు గురి కాకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.


పంట కాలువను పూర్తిగా ఆక్రమించిన దృశ్యం

లలిత కళలతో మానసిక ఉల్లాసం


విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న ప్రభుత్వ బాలుర పాఠశాల హెచ్ఎం ప్రేమజ్యోతి

బోట్‌క్లబ్: మానసిక ఉల్లాసానికి లలిత కళలు ఎంతో ఉపయోగపడతాయని పీఆర్ ప్రభుత్వ బాలుర పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రేమజ్యోతి అన్నారు. స్థానిక గాంధీనగర్ మున్సిపల్ చిల్డ్రన్స్ పార్క్ ఆవరణలో ఉన్న బాలభవన్‌లో శుక్రవారం వేసవి శిక్షణ తరగతులు ముగింపు సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బాలల మనో వికాసానికి, మానసిక ఉల్లాసానికి లలితకళలు చక్కగా ఉపయోగించుకోవాలన్నారు. బాలభవన్ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు, కరాటే విన్యాసాలు ఎంతగానో ఆకట్టుకుంటున్నాయన్నారు. అనంతరం పోటీలు విజేతలకు బహుమతులు అందజేశారు. ఇటీవల జరిగిన కరాటే టోర్నమెంట్ విజేతలకు స్వర్ణ, రజిత కాంస్య పతకాలను విద్యార్థులకు అందించారు. ఈ కార్యక్రమంలో బాలభవన్ పర్యవేక్షకులు శారద, బాలభవన్ ఉపాధ్యాయులు శ్రీరామచంద్రమూర్తి, కరాటే మూర్తి, శ్రీనివాస్, విద్యార్థులు, తల్లితండ్రులు తదితరులు పాల్గొన్నారు.

నీటి నమూనాల పరిశీలన

- రిజర్వాయర్లను సందర్శించిన కమిషనర్
- తాగునీటి నాణ్యతపై సంతృప్తి


నీటి నమూనాలను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటరావు, ఎస్ఈ సత్యకుమారి

కాకినాడ: కాకినాడ నగరంలోని ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లను (ఈఎల్ఎస్ఆర్) నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శుక్రవారం సందర్శించారు. ఎస్ఈ పి.సత్యకుమారి, ఇతర అధికారులతో కలిసి దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ స్కూల్ ప్రాంతాలలో పర్యటించిన ఆయన అక్కడి నీటి నమూనాలను పరిశీలించారు. కుళాయిల ద్వారా సరఫరా అవుతున్న తాగునీటి నాణ్యతపై వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో ఆయన రిజర్వాయర్లను సందర్శించారు. క్లోరిన్ నమూనాలను పరిశీలించి నీటి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. వాల్ పిట్ వద్ద నీరు నిల్వ లేకుండా ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని ఆదేశించారు. ఆయన వెంట ఈఈ మాధవి, ఏఈ వై.నాగేశ్వరరావు, సచివాలయ కార్యదర్శులు ఉన్నారు.

రోగులకు వైఎంవీఏ ఆధ్వర్యంలో అన్నదానం


కుష్ఠురోగులకు భోజనం వడ్డిస్తున్న సంస్థ సభ్యులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటి): యంగ్ మెన్స్ క్రిస్టియన్ అసోసియేషన్ 180వ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక బస్టాండ్ సమీపంలోని విముక్తి కాలనీ కుష్ఠు రోగులకు మధ్యాహ్నం భోజనం ఏర్పాటు చేశారు. కాకినాడ వైఎంసీఏ అధ్యక్షుడు పిఎం హెన్నీ అధ్యక్షత జరిగిన కార్యక్రమంలో కార్యదర్శి డాక్టర్ పీజేవీకే గాంధీ వైఎంసీఏ కార్యక్రమాల్ని వివరించారు. అనంతరం కుష్ఠురోగులకు ఏర్పాటు చేసిన ప్రత్యేక విందును అధ్యక్ష, కార్యదర్శి, సభ్యులు వడ్డించారు. ఈ కార్యక్రంలో విముక్తి చర్చి పాస్టర్ డాక్టర్ బి.జాన్‌బెంజి, వైఎంసీఏ కాకినాడ శాఖ ఉపాధ్యక్షుడు ఆకుమర్తి శామ్యూల్, కోశాధికారి డాక్టర్ శీరం ఐజాక్, సహాయ కోశాధికారి చప్పిడి శామ్యూల్ విక్టర్, బోర్డు మెంబరు మైకా జేసుదాసు, మోజెస్ బెన్నీ తదితరులు పాల్గొన్నారు.

జనసేన శ్రేణుల సంబరాలు

గొల్లప్రోలు: సార్వత్రిక ఎన్నికల్లో ఎన్డీఏ కూటమి ఘన విజయం సాధించడంతో పాటు పిఠాపురంలో జనసేన అధినేత పవన్‌కల్యాణ్‌కు భారీ మెజార్టీ రావడంతో గొల్లప్రోలు మండలం చేబ్రోలులో శుక్రవారం జనసేన శ్రేణులు సంబరాలు చేసుకున్నారు. చేబ్రోలు మాతాజీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రథంబాట వీధిలో బాణసంచా కాల్చి, కేక్ కట్ చేసి సంబరాలు జరిపారు. ఈ సందర్భంగా మాతాజీ ఫౌండేషన్ వ్యవస్థాపకులు బుద్దాల చంటిబాబు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ఎంతో శ్రమించారన్నారు. ఫలితంగా కూటమి ఘన విజయం సాధించిందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్ అవినీతికి తావు లేకుండా సుపరిపాలన చేస్తారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు తెలగంశెట్టి వెంకటేశ్వరరావు, ఓదురి నాగేశ్వరరావు, చల్లా చినబాబు తదితరులు పాల్గొన్నారు.

